సాక్షి అనంతపురం

గురువారం । 23 । నవంబర్ । 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.25

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.25 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.17 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.1°/21.4°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. పగలంతా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం చలి వాతావరణం కొనసాగింది.

న్యూస్‌రీల్

జిల్లాకు 2,725 మెట్రిక్ టన్నుల ఎరువులు



ఎరువుల రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ రవి

అనంతపురం అగ్రికల్చర్: రబీ ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు బుధవారం 2,725 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు జిల్లాకు చేరినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. బుధవారం ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా వచ్చిన ఎరువులను ఆయన పరిశీలించారు. కోరమాండల్ కంపెనీ నుంచి 14–35–14 రకం 1,504 మెట్రిక్ టన్నులు, 10–26–26 రకం 520 మెట్రిక్ టన్నులు, 20–20–0–13 రకం కాంప్లెక్స్ ఎరువులు 701 మెట్రిక్ టన్నులు సరఫరా అయినట్లు తెలిపారు.

అర్హులందరికీ 'విద్యా దీవెన'

అనంతపురం రూరల్: విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న విద్యా దీవెన పథకం అందుతుందని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా దీవెన పథకంలో విద్యార్థులు వారి తల్లులను భాగస్వామ్యం చేసి పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలన్న ఉద్దేశంతో జాయింట్ అకౌంట్ చేయించుకోవాలని ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. అయితే ఈ ప్రక్రియ ఆలస్యం అవుతున్నందున ఈ నెలలో విడుదల చేయనున్న నాల్గో విడత నగదు తల్లుల బ్యాంకు ఖాతాల్లోకే జమవుతుందని వివరించారు.

నూతన డీవైఈఓల బాధ్యతల స్వీకరణ



డీఈఓ నాగరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీవైఈఓలు శ్రీదేవి, శ్రీనివాసరావు

అనంతపురం ఎడ్యుకేషన్: కొత్తగా నియమితులైన అనంతపురం, గుత్తి డివిజన్ల డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు (డీవైఈఓ) శ్రీనివాసరావు, శ్రీదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీఈఓ వి.నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బాగా పని చేసి గుర్తింపు తెచ్చుకోవాలని డీఈఓ సూచించారు. కాగా అనంతపురం డీవైఈఓ శ్రీనివాసరావు, గుత్తి డీవైఈఓ శ్రీదేవిని ఎంఈఓలు, హెచ్‌ఎంలు కలిసి బొకేలు అందజేశారు. కార్యక్రమంలో పెద్దవడుగూరు ఎంఈఓ–2 గురుప్రసాద్, గార్లదిన్నె ఎంఈఓ–1 తారా చంద్రనాయక్, పెద్దపప్పూరు ఎంఈఓ–2 ఓబుళపతి, బుక్కరాయసముద్రం ఎంఈఓ–2 లింగా నాయక్, డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తంబాబు, నార్పల ఎంఈఓ–2 నారపరెడ్డి, ఆత్మకూరు ఎంఈఓ–2 రామాంజనేయులు, కళ్యాణదుర్గం ఎంఈఓ–1 విజయకుమారి, కంబదూరు ఎంఈఓ–2 మదన్‌మోహన్, యాడికి ఎంఈఓ–2 ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణమస్తు, షాదీ తోఫా సాయం

- 490 మంది లబ్ధిదారులకు రూ.3.86 కోట్ల నిధులు



అనంతపురం: పేదింటి ఆడబిడ్డల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం నగదు దీవెనలు అందించనుంది. వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా సాయం గురువారం లబ్ధిదారుల ఖాతాలో జమ చేయనుంది. జిల్లాస్థాయి సమావేశం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల పెళ్లికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తున్న విషయం విదితమే. ప్రతి మూడు నెలలకోసారి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి నగదు జమ చేస్తున్నారు. అందులో భాగంగా ఈ విడతలో 490 మంది లబ్ధిదారులకు రూ.3.86 కోట్ల నిధులు కేటాయించినట్లు డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష, ఎస్సీ, ఎస్టీల్లో కులాంతర వివాహాలు చేసుకున్న వారికి రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.50వేలు, బీసీల్లో కులాంతర వివాహాలకు రూ.75 వేలు, మైనార్టీలకు రూ.లక్ష, భవన నిర్మాణరంగ కార్మికులకు రూ.40 వేలు అందుతుందన్నారు.



స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు, సత్యసాయి విద్యాసంస్థల సిబ్బంది



విద్యార్థికి పట్టా అందజేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, చిత్రంలో గవర్నర్ నజీర్, మంత్రి ఉషశ్రీ చరణ్

అంబరం.. విద్యా సంబరం

- ఘనంగా సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవం
- ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు
- 21 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం
- విద్యార్థులు జాతి నిర్మాణానికి పాటుపడాలని పిలుపు



రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న ఆర్‌జే రత్నాకర్



సత్యసాయి మహాసమాధి వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి

ప్రశాంతి నిలయం: కష్టపడి చదివారు. సత్తా చాటారు. విలువలు నింపుకున్నారు. సాక్షాత్తూ దేశ ప్రథమ పౌరురాలితో ప్రశంసలందుకుని మురిసిపోయారు. తమ పిల్లలు పట్టాలందుకుంటుండగా ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. పుట్టపర్తిలోని సాయి హీరా కన్వెన్షన్ హాల్ ఆ మధుర క్షణాలకు వేదికైంది. బుధవారం సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. వేద పండితుల వేదఘోష.. విద్యార్థుల సాయినామస్మరణ.. వక్తల దివ్య ప్రసంగాలు వెరసి ఆద్యంతం అంగరంగ వైభవంగా సాగాయి. సత్యసాయి జయంత్యుత్సవాల్లో భాగంగా నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు.

స్నాతకోత్సవంలో ముందుగా సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ గవర్నింగ్ బాడీ సభ్యులు వేదిక వద్దకు బ్రాస్ బ్యాండ్ నడుమ చేరుకున్నారు. సత్యసాయి డీమ్డ్ వర్సిటీ వైస్ చాన్సలర్ రాఘవేంద్ర ప్రసాద్ ఉత్సవాన్ని ప్రారంభించాలని ఫౌండర్ చాన్సలర్ అయిన సత్యసాయిని అభ్యర్థించగా, 'ఐ డిక్లేర్డ్ కాన్వొకేషన్ ' అని ఆయన అనుమతిచ్చినట్లుగా డిజిటల్ స్క్రీన్ నుంచి ప్రకటించారు. అనంతరం వైస్ చాన్సలర్ హోదాలో ప్రొఫెసర్ రాఘవేంద్ర ప్రసాద్ సత్యసాయి విద్యాసంస్థల్లో బోధన, పరిశోధన, అభివృద్ధిని వివరిస్తూ ప్రారంభోపన్యాసం చేశారు.

ఆధునిక విద్యతో అత్యుత్తమ ఫలితాలు..

సత్యసాయి ఆశయాలకు అనుగుణంగా ఆధునిక విద్యావిధానాన్ని అనుసరిస్తూ దేశీయంగా, అంతర్జాతీయంగా సత్యసాయి విద్యాసంస్థలు శాస్త్ర, సాంకేతిక, పరిశోధనా రంగాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని ప్రొఫెసర్ రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. ప్రశాంతి నిలయం, ముద్దెన హళ్లి, బృందావనం, అనంతపురంలోని నాలుగు క్యాంపస్‌ల ద్వారా పలు కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణంగా డీప్ లెర్నింగ్, బాటం కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీస్ కోర్సులు ప్రవేశపెట్టి పరిశోధనలను ప్రోత్సహిస్తున్నామన్నారు. అత్యాధునిక సెంట్రల్ లేబొరేటరీ ద్వారా జెనోమిక్, యాంటీ క్యాన్సర్ డిసీజెస్, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, అట్మాస్ఫియరిక్ కెమిస్ట్రీ రంగాల్లో పరిశోధనలు నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా నాలుగేళ్ల కోర్సులు ప్రారంభించామన్నారు. తమ విద్యార్థులు, సిబ్బంది 140 పరిశోధనా పేపర్లు, 7 బుక్ చాప్టర్లు ప్రచురించినట్లు వెల్లడించారు. 300 వెబినార్లు, ట్రైనింగ్ కార్యక్రమాలు, సెమినార్లలో పాల్గొన్నారన్నారు. విద్యార్థులతో కాన్వొకేషన్ ప్రతిజ్ఞ చేయించారు.

నేడు సత్యసాయి జయంతి

ప్రశాంతి నిలయ: సత్యసాయి 98వ జయంతి వేడుకలు ప్రశాంతి నిలయంలో గురువారం ఘనంగా జరగనున్నాయి. దేశ విదేశాలకు చెందిన సత్యసాయి భక్తులు పెద్ద ఎత్తున పుట్టపర్తి చేరుకున్నారు. వేడుకలకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సిబ్బంది సర్వం సిద్ధం చేశారు.

ఘన సన్మానం..

వేడుకల్లో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్మును సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు దుశ్శాలువ, సత్యసాయి జ్ఞాపికతో సన్మానించారు. గవర్నర్ నజీర్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఉషశ్రీ చరణ్‌ను ట్రస్ట్ సభ్యుడు మోహన్ సన్మానించారు. వేడుకల్లో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్,పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, పలువురు సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు, సత్యసాయి విద్యాసంస్థలు, సేవా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

జాతి నిర్మాణానికి పాటు పడండి ..

ప్రతి విద్యార్థి ఆత్మ విశ్వాసం, సానుకూల దృక్పథంతో సాగుతూ జాతి నిర్మాణానికి పాటుపడాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. స్నాతకోత్సవంలో విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు. ధర్మాన్ని పాటిస్తూ ఉత్తమ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ఆధ్యాత్మికంగా ఉన్నతంగా ఉండేలా జీవన విధానాన్ని రూపొందించుకోవాలని కోరారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ విలువలు, ఆధ్యాత్మిక సమ్మిళితమైన ఆధునిక విద్యను అందిస్తున్న సత్యసాయి విద్యాసంస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని అత్యుత్తమ భవిష్యత్తును పొందాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. వివిధ కోర్సుల్లో ప్రతిభ చాటిన 21 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు. పరిశోధనలతో ఉత్తమ ఫలితాలు సాధించిన 14 మందికి డాక్టరేట్లు, 560 మందికి డిగ్రీ పట్టాలు పంపిణీ చేశారు. చివరిగా చాన్సలర్ హోదాలో ప్రొఫెసర్ చక్రవర్తి 'ఐ క్లోజ్ ది కాన్వొకేషన్' అని ప్రకటించారు.

టీడీపీలో అసమ్మతి సెగలు!

- అధినేతతో దీపక్‌రెడ్డి, పూల నాగరాజు భేటీ
- స్థానికులకే అవకాశం కల్పించాలంటూ పట్టు
- రాయదుర్గం టికెట్‌పై టీడీపీ కేడర్‌లో అయోమయం



బాబు నివాసం వద్ద చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ పూలనాగరాజు

రాయదుర్గం: సార్వత్రిక ఎన్నికల వేళ తెలుగుదేం పార్టీలో అసమ్మతి సెగలు కక్కుతోంది. ఆ పార్టీలో గ్రూపు రాజకీయాలు కేడర్‌ను కలవర పెడుతోంది. అప్పుడే పలువురు ఆశావహులు టికెట్ కోసం రేసు మొదలు పెట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఇలాకా అయిన రాయదుర్గంలో ఈసారి ఎమ్మెల్యే టికెట్ స్థానికులకే ఇవ్వాలనే డిమాండ్ పెరుగుతోంది. పార్టీలోని పలువురు సీనియర్లు ఇప్పటికే రహస్య సమావేశాలు నిర్వహించి.. తమ అభిప్రాయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ పూల నాగరాజు సమావేశమయ్యారు. ఈ భేటీలో తాజా రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చినట్టు తెలుస్తోంది. అనంతరం వారిద్దరూ చంద్రబాబు నివాసం వద్ద కలిసి దిగిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇది పార్టీలోనూ, ప్రజల్లోనూ తీవ్ర చర్చనీయాంశమైంది. 2014కు ముందు టీడీపీని సంస్థాగతంగా బలోపేతం చేసి చివర్లో కాలవ శ్రీనివాసులు చేతిలో పెట్టాల్సి వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో ఆయన్ని రాయదుర్గం నుంచి తప్పించి ఆ అవకాశం తనకే ఇవ్వాలని దీపక్‌రెడ్డి పట్టు బట్టినట్టు విశ్వశనీయవర్గాల సమాచారం. స్థానికులకు అవకాశం కల్పించాల్సి వస్తే వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన పూల నాగరాజు పేరు ప్రస్తావనకు తెచ్చినట్టు తెలుస్తోంది. కాలవ శ్రీనివాసులుకైతే తమ మద్దతు ఉండబోదని తెగేసి చెప్పినట్టు పార్టీలో బలంగా వినిపిస్తోంది.

ఇక్కడో మాట.. అక్కడో మాట..

చంద్రబాబు రాయదుర్గం పర్యటనలో ఇక్కడి ఎమ్మెల్యే అభ్యర్థిగా కాలవ శ్రీనివాసులు పేరు ప్రస్తావించినప్పటికీ ఆ మరుసటి దినమే నంద్యాల సభలో మాటమార్చారు. అందరి అభిప్రాయం తీసుకున్నాకే అభ్యర్థిత్వం ఖరారు చేస్తామని కుండబద్దలు కొట్టారు. అంతేకాక ఎన్నికల సమయంలోనే సీట్లపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. దీంతో కాలవ అభ్యర్థిత్వంపై కేడర్ పునరాలోచనలో పడినట్లయ్యింది.

- తాజాగా దీపక్‌రెడ్డి, పూల నాగరాజు భేటీ తర్వాత టీడీపీ కేడర్‌లో మరింత గందరగోళానికి దారి తీసింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కూడా వీరి పట్ల సానుకూలత వ్యక్తం చేస్తున్నట్టు వారి కేడర్ ప్రచారం చేసుకుంటోంది. దీనికి తోడు రాయదుర్గంలో ప్రజలతో మమేకమై ముందుకు సాగుతున్న వైఎస్సార్‌సీపీని ఎదుర్కోవాలంటే బలమైన వ్యూహం అవసరమని టీడీపీ భావిస్తోంది. నేతల మధ్య అసంతృప్తులు, విభేదాలు ఉంటే గట్టెక్కడం కష్టమేనని అంచనా వేస్తోంది.

అభ్యర్థుల మార్పులో చంద్రబాబు దిట్ట..

సర్వేల పేరుతో తరచూ అభ్యర్థులను మార్చడంలో చంద్రబాబు దిట్ట. 1989లో కాట గోవిందప్పతో సేవలు చేయించుకుని... 1994లో బండి హులికుంటప్పకు టీడీపీ ఎమ్మెల్యే టికెట్టు కట్టబెట్టారు. ఆ తర్వాత 1999లో పూజారి జితేంద్రప్పను తెరమీదకు తెచ్చారు. 2004లో మెట్టు గోవిందరెడ్డికి అవకాశం కల్పించారు. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో దీపక్‌రెడ్డికి టిక్కెట్టు ఇచ్చారు. 2014 వరకు అతడితో సేవ చేయించుకుని ఎన్నికలకు 20 రోజుల ముందు అనూహ్యంగా కాలవ శ్రీనివాసులును తీసుకొచ్చారు. తిరిగి 2019లో ఆయనకే మరో అవకాశం కల్పించారు. ఇలా వరుసగా అభ్యర్థులను మార్చే చంద్రబాబు ఈసారి కూడా అలాంటి పంథానే అవలంబిస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

విద్యా ప్రదాత వైఎస్ రాజశేఖరరెడ్డి



వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, రాప్తాడు ఎమ్మెల్యే ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: ప్రతిష్టాత్మక ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేసి పేదింటి పిల్లలకు ఉన్నత విద్యను చేరువ చేసిన విద్యాప్రదాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కొనియాడారు. ఆ పథకం కింద ఉచితంగా చదువుకుని ఎంతోమంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) క్యాంపస్‌లో పాలక మండలి అనుమతితో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డితో కలిసి ఎంపీ, ఎమ్మెల్యేలు బుధవారం ఆవిష్కరించారు. అనంతరం లా విభాగం నుంచి కామన్ మెస్ హాలు వరకు నిర్మించిన డబుల్ రోడ్డు, సరస్వతి హాస్టల్, లా విభాగం మూట్ కోర్టు, నక్షత్ర తోటను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాధవ్, ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, మహోన్నత వ్యక్తి అని అభివర్ణించారు. 1982–83లో విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడే ఆయన విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. సీఎం హోదాలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి లక్షలాది మంది పేదలు ఉచితంగా ఉన్నత విద్య అభ్యసించేలా చేశారన్నారు. వైఎస్సార్ ఆశయాలను సీఎం జగన్ ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థుల కోసం యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ జితేంద్రకుమార్ మిశ్రా వితరణ చేసిన రెండు బ్యాటరీ కార్లను ఎంపీ, ఎమ్మెల్యే ఆవిష్కరించారు. రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ విద్యార్థి విభాగం నేత లింగారెడ్డి, ప్రొఫెసర్ శంకర్ నాయక్, టి.పురుషోత్తం రెడ్డి, కరాటే పెద్దన్న పాల్గొన్నారు.

27న సామాజిక సాధికార యాత్ర



వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి, చిత్రంలో జిల్లా అధ్యక్షుడు పైలా

- విజయవంతం చేయండి
- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి పిలుపు

తాడిపత్రిటౌన్: జగనన్న ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జరిగిన మేలును వివరించేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర ఈ నెల 27న తాడిపత్రిలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. బుధవారం తాడిపత్రిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, తాడిపత్రి, పెద్దపప్పూరు మండల నాయకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పైలా మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకొచ్చారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో పెద్దపీట వేశారన్నారు. పట్టణంలో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రకు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని యాత్రను విజయవంతం చేసేలా విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చింతల వేంకటరమణస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కందిగోపుల మురళీప్రసాద్‌రెడ్డి, ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రాజు, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, నాయకులు వెంకటరెడ్డిపల్లి పుల్లారెడ్డి, రామేశ్వరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, హనుమంతరెడ్డి, సూర్యనారాయణ, పెద్దపప్పూరు మండల నాయకులు ఎంపీపీ రామిరెడ్డి, జెడ్పీటీసీ రవిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ రామ్మూర్తిరెడ్డి, కన్వీనర్ అమర్‌నాథరెడ్డి, ముచ్చుకోట యోగేశ్వరెడ్డి, రామాంజులరెడ్డి పాల్గొన్నారు.

ఏసీబీ వలలో సబ్ రిజిస్ట్రార్

- రూ. 10 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ శ్రీనివాస నాయక్



వివరాలను వెల్లడిస్తున్న ఏసీబీ అధికారులు

పుట్టపర్తి: బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస నాయక్ రూ. 10 వేలు లంచం తీసుకుంటూ బుధవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి, సీఐ శాంతిలాల్ ప్రభాకర్ తెలిపిన మేరకు.. పుట్టపర్తి టౌన్ పరిధిలోని బ్రాహ్మణపల్లికి చెందిన సురేంద్రరెడ్డి తన సోదరులతో పాటుగా ఉన్న ఉమ్మడి ఆస్తిలో తన వంతు భాగాన్ని రిజిస్టర్ చేయించుకోవాలని సబ్ రిజిస్ట్రార్‌ను ఆశ్రయించాడు. స్టాంప్ డ్యూటీ తగ్గించుకుంటామని, తనకు రూ.50 వేలు లంచం ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్ డీల్ కుదుర్చుకున్నాడు. బుధవారం రాత్రి సురేంద్రరెడ్డి అడ్వాన్స్‌గా సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ నాయక్‌కు రూ.10 వేలు, అతని భార్యకు రూ.10 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేశారు. అదుపులోకి తీసుకుని అనంతపురం తరలించారు.

అర్జీలపై నిర్లక్ష్యం వీడండి



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

బొమ్మనహాళ్: వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించే అర్జీలపై నిర్లక్ష్యం వీడి త్వరితగతిన పరిష్కారం చూపాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. బొమ్మనహాళ్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 'జగనన్నకు చెబుదాం' మండల స్థాయి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులందరూ పాల్గొన్నారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 70 అర్జీలు అందాయి. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. గడువులోపు అర్జీలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణీ సుస్మిత, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, డీఎస్ఓ శోభారాణి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజ్, డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, హార్టికల్చర్ డీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, డీఈఓ నాగరాజు, ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రూప్లానాయక్, ఎల్‌డీఎం సత్యరాజ్, మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మహమ్మద్ రఫీ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ షకీలాబేగం, ఇతర మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

- అంతకుముందు నేమకల్లు ఆంజనేయ స్వామిని కలెక్టర్ గౌతమి దర్శించుకున్నారు. పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం ఫలికారు. ప్రత్యేక పూజలు చేసి కలెక్టర్‌కు తీర్థప్రసాదాలు, స్వామి చిత్రపటం అందజేశారు.
- హరేసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలోని జిందాల్ సా ఫ్యాక్టరీని కలెక్టర్ గౌతమి పరిశీలించారు. జిందాల్ సా ఫ్యాక్టరీలోని పవర్ ప్లాంట్, బ్లాస్ట్ పర్మస్, డిటీ ప్లాంట్, తదితర విభాగాలను పరిశీలించి పనితీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

తాడిపత్రి అర్బన్: పద్దెనిమిదేళ్ల లోపు వయసున్న పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని నాపరాళ్ల పరిశ్రమల నిర్వాహకులను కార్మికశాఖ కమిషనర్ రఘురాములు హెచ్చరించారు. బాల కార్మిక నిర్మూలనలో భాగంగా దేశ వ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం ఉదయం తాడిపత్రి ప్రాంతంలో కార్మికశాఖ అధికారులు శివప్రసాద్, ప్రతాప్‌నాయుడు, జిల్లా బాలల పరిరక్షణ సమితి ఇన్‌చార్జ్ వెంకటేశ్వరీతో కూడిన అధికారుల బృందం తనిఖీలు చేపట్టింది. పలు దుకాణాలు, టీస్టాళ్లు, నాపరాళ్ల పరిశ్రమల్లో పనిచేస్తున్న పిల్లలను గుర్తించి అనంతపురం బాలల సంక్షేమ సమితి ఎదుట వర్చువల్ విధానంలో హాజరు పరిచారు. అనంతరం పిల్లలు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించాలంటూ ఎంఈఓ నాగరాజుకు సూచించారు. కార్యక్రమంలో ఎన్జీఓ సభ్యులు శిరీష, తిరుపతిరావు పాల్గొన్నారు.

కూలిన బ్రిడ్జిని పరిశీలించిన అధికారులు

కణేకల్లు: స్థానిక చిక్కణ్ణేశ్వర చెరువు అవుట్ ఫ్లో రెగ్యులేటర్ వద్ద మంగళవారం కుప్పకూలిన బ్రిడ్జిని బుధవారం ఉదయం హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్, ఈఈ ఎం.వెంకటరమణరెడ్డి పరిశీలించారు. బ్రిడ్జి అటు వైపు పొలాలతోపాటు గంగలాపురం గ్రామానికి రాకపోకలు సాగించేందుకు మార్గం ఇదొక్కటేనని గుర్తించిన వారు... గ్రామస్తులు ఇబ్బందులు పడకుండా కనీసం బైక్‌లు వెళ్లేలా దారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని హెచ్చెల్సీ డీఈఈ మద్దిలేటి, ఏఈఈ అల్తాఫ్‌ను ఆదేశించారు. ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నూతన బ్రిడ్జి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

రాష్ట్రపతికి ఘన స్వాగతం

పుట్టపర్తి రూరల్: సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు పుట్టపర్తికి విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విమానాశ్రయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. ఒడిశాలోని జహర్సుగూడ విమానాశ్రయం నుంచి బయలుదేరిన రాష్ట్రపతి బుధవారం మధ్యాహ్నం 2.47 గంటలకు పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, అడిషనల్ డీజీపీ (లా అండ్ ఆర్డర్) డా.శంకభత్ర బాగ్చీ, కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ మాధవ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహమ్మద్ ఇక్బాల్, మంగమ్మ, భూమిరెడ్డి రామగోపాలరెడ్డి, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ తిప్పేస్వామి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, ఏపీ బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. సాయంత్రం ఆమె తిరుగు ప్రయాణమై వెళ్లారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతున్న ఏపీ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్



మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, పీఆర్ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, అదనపు డీజీపీ డా.శంకభత్ర బాగ్చీ, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహమ్మద్ ఇక్బాల్, మంగమ్మ, భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

జనవాక్కు

'నాడు-నేడు'తో కార్పొరేట్ స్థాయికి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన విద్యాసంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ చేకూరింది. ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర చరిత్రలో నాడు- నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడుల రూపు రేఖలు మార్చి కార్పొరేట్ స్థాయికి ఎదిగేలా చేశారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందుతోంది. ఒకప్పుడు ప్రభుత్వ బడులంటే పిల్లలను చేర్చేందుకు వెనకడుగు వేసిన తల్లిదండ్రులు నేడు అవే బడుల్లో పిల్లలకు అడ్మిషన్ల కావాలంటూ వెంటపడుతున్నారు. విద్యాప్రమాణాలు మెరుగుపడడంతో అందరూ ప్రభుత్వ బడులవైపే మొగ్గు చూపుతున్నారు.

– ఎం.వెంకటేశులు, టీచర్, ఎంపీపీ స్కూలు, శెట్టూరు

రూ.లక్షల విలువ చేసే ఇల్లు వచ్చింది



నా భర్త యక్కలూరు నారాయణస్వామి, నేను బీఏ వరకు చదువుకున్నాం. మాకు ఇద్దరు పిల్లలు, ఇద్దరమూ ప్రైవేట్ ఉద్యోగాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్న మాకు... సొంతిల్లు అనేది ఓ కలగానే ఉండిపోయింది. అయితే మేము ఊహించని విధంగా వలంటీర్ వచ్చి వివరాలు తీసుకెళ్లి ఒకటిన్నర సెంటు స్థలానికి పట్టా తెచ్చిచ్చాడు. గృహ నిర్మాణానికి జగన్ సర్కార్ అన్ని విధాలా సహకరించింది. ప్రస్తుతం సొంతింట్లో ఎంతో సంతోషంగా జీవిస్తున్నాం. ఇదంతా సీఎం వైఎస్ జగన్ చలువే. రూ.లక్షల విలువ చేసే ఇంటిని మాకిచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడ్డాం.

– ఎస్ రమాదేవి, జగనన్నకాలనీ, పామిడి

విద్యాప్రమాణాలు మెరుగుపడ్డాయి



చదువుకు మించిన గొప్ప ఆస్తి ఈ ప్రపంచం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలను సీఎం వైఎస్ జగన్ అమలు చేశారు. తొలుత వీటిని అనుసరించడం కాస్త ఇబ్బందిగా ఉన్నా... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థుల వైపు నుంచి ఆలోచిస్తే సంస్కరణల అమలు మంచిదనే గుర్తించాం. గుణాత్మక విద్యకు పెద్ద పీట వేస్తూనే కార్పొరేట్ దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ప్రభుత్వ బడుల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లిష్ మీడియం చదువులు అందుబాటులోకి వచ్చాయి. సీఎం జగన్ అమలు చేసిన సంస్కరణల వల్లనే ఇదంతా సాధ్యమైంది.

– ఎన్.రామ్మోహన్, టీచర్, 5వవార్డు జెడ్పీహెచ్ఎస్, పామిడి

లక్షాధికారినయ్యా..



రోజూ ఇంటిల్లిపాది కూలి పనికి పోతేనే కుటుంబం గడుస్తుంది. ఇంటి అద్దె కట్టడం చాలా భారంగా ఉండేది. సొంతిల్లు కోసం గత ప్రభుత్వంలో అర్జీల మీద అర్జీలు ఇచ్చినా ఫలితం దక్కలేదు. జగన్ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చి వివరాలు తీసుకెళ్లి ఇంటి పట్టా తెచ్చిచ్చారు. గార్లదిన్నె రైల్వే స్టేషన్ పక్కనే ఉన్న జగనన్న లే అవుట్‌లో రూ. లక్షల విలువ చేసే స్థలం నా పేరుపై సీఎం జగన్ ఇచ్చారు. ఇంటి నిర్మాణం కూడా పూర్తి కావొచ్చింది. సొంతింటి కల సాకారం చేస్తూ నన్ను లక్షాధికారిని చేసిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

– రమణమ్మ, గార్లదిన్నె

ప్రశ్నించుకుంటే పనితీరు మెరుగు

- కేజీబీవీ ఎస్‌ఓల సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు



మాట్లాడుతున్న ఏపీసీ వరప్రసాదరావు

అనంతపురం ఎడ్యుకేషన్: మనం ఎలా పనిచేస్తున్నామని ఎవరికి వారు ప్రశ్నించుకుంటే పనితీరు మెరుగు పడుతుందని సమగ్ర శిక్ష ఏపీసీ జె.వరప్రసాదరావు అన్నారు. సమగ్ర శిక్ష కార్యాలయంలో జిల్లాలోని కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాథ, నిరుపేద ఆడపిల్లలు చదువుకుంటున్న కేజీబీవీల్లో పని చేస్తున్న అందరూ సేవా భావం కలిగి ఉండాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లందరూ రోజూ డ్యూటీలో ఉండాల్సిందేనన్నారు. ఎస్‌ఎంఎఫ్, నాడు-నేడు నిధులు వేర్వేరుగా ఉంటాయని, ఒకే ఖాతా కావడంతో ఏ నిధులు ఎందుకు ఖర్చు చేస్తున్నారనేది పక్కాగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఇప్పటి వరకూ ఎస్‌ఎంఎఫ్, మన బడి నాడు-నేడు నిధులు ఎన్ని వచ్చాయి... ఎంత ఖర్చు చేశారు... బ్యాలెన్స్ ఎంత ఉందనే వివరాలు గురువారం సాయంత్రం లోపు కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. విద్యార్థినుల నోట్ బుక్స్ కరెక్షన్ చేయడం లేదనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, సీఆర్టీలందరూ కచ్చితంగా వారివారి సబ్జెక్టులకు సంబంధించి ఎప్పటికప్పుడు కరెక్షన్లు చేయాలన్నారు. ఎస్‌ఓలు కూడా ర్యాండమ్‌గా పరిశీలించాలన్నారు. ఈ అంశంపై త్వరలో స్పెషల్ డ్రైవ్ చేపడతామన్నారు. ఐఎఫ్‌పీ ప్యానెళ్ల వినియోగం తప్పనిసరి అన్నారు. ఎస్‌ఓలు, సీఆర్టీలు, పీజీటీలు, ఇతర సిబ్బంది సమన్వయంతో ఉండాలన్నారు. ఆకస్మిక తనిఖీల్లో లోటుపాట్లు గుర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జీసీడీఓ మహేశ్వరి, సీఎంఓ గోపాలకృష్ణయ్య, ఏపీఓ నారాయణస్వామి పాల్గొన్నారు.

జీవ వైవిధ్యం సంస్కృతిలో ఓ భాగం: ఎస్కేయూ వీసీ



నక్షత్ర మండలం తోటను ప్రారంభిస్తున్న వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, డాక్టర్ ఖాదర్‌వలీ

అనంతపురం: జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపు అనేవి మన సంస్కృతిలో ఓ భాగమని ఎస్కేయూ వీసీ డాక్టర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అన్నారు. వర్సిటీ ఎస్టేట్ ఆఫీసర్ ప్రొఫెసర్ బి. రవి ప్రసాదరావు ఆధ్వర్యంలో 'కల్చర్ అండ్ బయో డైవర్సిటీ' అంశంపై బుధవారం పాలిమర్ సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. జీవ వైవిధ్యం పెంపుదలకు సృజనాత్మకతతో కూడిన ఆవిష్కరణలు అవసరమన్నారు. స్వతంత్ర ఆహార శాస్త్రవేత్త పద్మశ్రీ డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ.. జీవ వైవిధ్యం లేనిదే సృష్టి లేదన్నారు. దేవుడు మనకి ఇచ్చిన అద్భుతమైన చెట్లలో రావి ఒకటన్నారు. మొత్తం విజ్ఞానాన్ని రావి చెట్టు నిక్షిప్తం చేసుకుందన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.కృష్ణకుమారి, ప్రగతి గ్రూపు నిర్వాహకులు డాక్టర్ జి.బాలకోటేశ్వరరావు, బోటనీ మాజీ ప్రొఫెసర్ పుల్లయ్య, యోగి వేమన వర్సిటీ ప్రొఫెసర్ ఎ.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, ప్రొఫెసర్ జీవీ రమణ, ప్రొఫెసర్ జి.నరసింహన్, డాక్టర్ డి.మురళీధర్ రావు, డాక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

ప్రతి మహిళా లక్షాధికారి కావాలి

- స్వయం ఉపాధితో జీవనం మెరుగుపరుచుకోవాలి
- మహిళా బ్యాంకు ప్రారంభోత్సవంలో ఆర్డీటీ డైరెక్టర్ విశాలాఫెర్రర్



బ్యాంకును ప్రారంభిస్తున్న విశాలాఫెర్రర్

కళ్యాణదుర్గం: ప్రతి మహిళా స్వయం ఉపాధితో జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకుని లక్షాధికారి కావాలని ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాలాఫెర్రర్ అన్నారు. కళ్యాణదుర్గంలో అన్నేఫెర్రర్ మహిళా పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి సంఘం లిమిటెడ్ బ్యాంకును ఆర్డీటీ రీజన్ డైరెక్టర్ సుబ్బారావుతో కలసి బుధవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. మహిళలే సొంతంగా బ్యాంకు ఏర్పాటు చేసుకోవడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. కళ్యాణదుర్గం మండలంలోని 48 గ్రామాల మహిళలను ఐక్యం చేస్తూ మొట్టమొదటి సారిగా మహిళా బ్యాంకును ప్రారంభించినట్లు వివరించారు. కళ్యాణదుర్గంలోనే మొట్టమొదటి సారిగా ఆర్డీటీ సేవలను ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ప్రారంభించారని గుర్తు చేశారు. ఆ స్ఫూర్తితోనే పైలెట్ ప్రాజెక్ట్‌గా మహిళాబ్యాంకును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ బ్యాంకులో మహిళలే బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా ఉంటూ ఎగ్జిక్యూటివ్ కమిటీతో కార్యకలాపాలను కొనసాగిస్తారన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్‌లు మీనాక్షి, సురేంద్ర, నారాయణస్వామి, బాషా, ఎస్టీఎల్ సూర్యనారాయణ, నారాయణస్వామి, కృష్ణయ్య పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

తాడిపత్రి అర్బన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. అందిన పక్కా సమాచారంతో బుధవారం ఉదయం తాడిపత్రిలోని ఫ్లై ఓవర్ వద్ద సీఐ హమీద్ ఖాన్, సిబ్బందితో కలసి తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన అసోంకు చెందిన ఓమర్ అలీ, దిల్‌దార్ హుస్సేన్ వద్ద 1,080 గ్రాముల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. పట్టుబడిన ఇద్దరూ చుక్కలూరు రోడ్డులో నివాసముంటున్నట్లుగా గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.



వలంటీర్ కుటుంబానికి ప్రభుత్వ అండ



బాధిత కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత (చిత్రంలో) కార్పొరేటర్ హరిత

అనంతపురం కార్పొరేషన్: మృతి చెందిన వలంటీర్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. సీఎం సహాయ నిధి రూ.5 లక్షలు మంజూరు చేసింది. నగరంలోని శారదనగర్‌కు చెందిన వలంటీర్ జహరాబీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5లక్షలను చెక్కు రూపంలో మృతురాలి కుటుంబీకులకు బుధవారం 42వ వార్డు సచివాలయం వద్ద ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, కార్పొరేటర్ హరిత అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జయరాంనాయుడు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు-బేతంచెర్ల మధ్య లైన్ క్లియర్

గుంతకల్లు: గుంతకల్లు-గుంటూరు రైలు మార్గం ప్రాజెక్ట్ పరిధిలోని గుంతకల్లు-బేతంచెర్ల మధ్య 105 కి.మీల డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు పూర్తయినట్లు డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన గుంటూరు-గుంతకల్లు సెక్షన్‌లో డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. దాదాపు 401 కి.మీ. మేర ఉన్న ఈ రైలు మార్గానికి 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.3,887 కోట్లను ప్రభుత్వం కేటాయించినట్లు గుర్తు చేశారు. ఇప్పటి వరకూ నల్లపాడు-జగ్గంపేట-కృష్ణాపురం మధ్య 174 కి.మీ, బేతంచెర్ల-మల్కాపురం మధ్య 25 కి.మీ, డోన్-గుంతకల్లు మధ్య 71 కి.మీ. డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయన్నారు. దీంతో మొత్తం 281 కి.మీ. గుంటూరు-గుంతకల్లు ప్రాజెక్ట్‌లో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇదే మార్గంలోని మల్కాపురం-డోన్ మధ్య 11 కి.మీ. కేవలం రెండు నెలల్లో రికార్డు స్థాయిలో పూర్తి చేయడం గర్వ కారణమన్నారు.

జీవితంపై విరక్తితో వృద్ధుడి బలవన్మరణం

అనంతపురం సిటీ: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు జీవితంపై విరక్తితో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్ తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం మండలం వడియంపేటకు చెందిన వెంకట్రామిరెడ్డి (65) దాదాపు 40 ఏళ్లుగా ఆస్తమాతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. చలి తీవ్రత పెరుగుతుండడంతో ఊపిరి తీసుకునేందుకు సైతం ఇబ్బంది పడసాగాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన బుధవారం ఉదయం 10 గంటలకు వడియంపేట శివారులోని పట్టాలపైకి చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నకిలీ సరుకులు విక్రయిస్తే కఠిన చర్యలు

అనంతపురం క్రైం: నకిలీ సరుకులు సరఫరా చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ మునిరామయ్య హెచ్చరించారు. అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం పట్టణాల్లో నకిలీ ఉత్పత్తులపై విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య ఆధ్వర్యంలో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పలు ప్రముఖ కంపెనీలకు చెందిన నకిలీ ఉత్పత్తులను గుర్తించి, రూ.91,575 విలువ చేసే సరుకులను సీజ్ చేశారు. ఆయా దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేసి, ఆయా పోలీసుస్టేషన్లకు బదిలీ చేశారు.

గ్రామీణానికి రూ.63.54 కోట్లు

- అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో పొడవైన వంతెనలకు రూ.52.96 కోట్లు
- రెండు జిల్లాల్లో రహదారుల మరమ్మతులకు రూ.10.58 కోట్లు
- పీఎంజీఎస్‌వై-111 కింద నిధుల కేటాయింపు
- పంచాయతీరాజ్ ఎస్‌ఈ భాగ్యరాజ్ వెల్లడి

అనంతపురం సిటీ: నగరాలు, పట్టణాలే కాక పల్లెలనూ అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు జగన్ సర్కార్ కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం (పీఎంజీఎస్‌వై) – 111 కింద రూ.63.54 కోట్ల మేర నిధులతో ఉమ్మడి జిల్లాలో పొడవైన వంతెనలతో పాటు గ్రామీణ రహదారుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంది. ఇందులో 60 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఎనిమిది బ్రిడ్జిలకు రూ.52.96 కోట్లు కాగా, పొడవైన మూడు రహదారులకు రూ.10.58 కోట్లు కేటాయించారు. అనంతపురం జిల్లాలో రూ.36.55 కోట్లతో ఐదు పొడవైన బ్రిడ్జిలు, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.16.41 కోట్లతో మూడు బ్రిడ్జిలకు మరమ్మతులు చేపట్టనున్నారు. అలాగే అనంతపురం జిల్లాలో రెండు పొడవైన రహదారులకు రూ.8.45 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో ఒక రోడ్డుకు రూ.2.13 కోట్లు చొప్పున కేటాయించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నెల రోజుల్లో పనుల ప్రారంభం

విజయవాడలోని ఇంజినీరింగ్ చీఫ్ కార్యాలయ అధికారులు ఇప్పటికే టెండర్లు పిలిచారు. నెల రోజుల్లో టెండర్ల ప్రక్రియ ఖరారు చేసి, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటారు. ఉన్నతాధికారుల నుంచి తదుపరి ఆదేశాలు అందగానే పనులు మొదలుపెట్టాలని కాంట్రాక్టర్లను ఆదేశిస్తాం. నిర్దేశిత గడువులోపు అత్యంత నాణ్యతతో పనులు పూర్తి చేయిస్తాం.

– యమ్మాని భాగ్యరాజ్, ఎస్‌ఈ, పంచాయతీరాజ్ శాఖ, అనంతపురం సర్కిల్

ఉమ్మడి జిల్లాలో చేపట్టే బ్రిడ్జి పనులు

నియోజకవర్గం	బ్రిడ్జి	మీటర్లు	నిధులు
అనంతపురం	జాతీయ రహదారి నుంచి కోటంక	62.64	రూ.4.79 కోట్లు
గుంతకల్లు	గుత్తి-వజ్రకరూరు	68.06	రూ.5.42 కోట్లు
గుంతకల్లు	గుత్తి-వజ్రకరూరు	41.76	రూ. 3.27 కోట్లు
పెనుకొండ	పాలసముద్రం-ఇ.గంగంపల్లి	105	రూ. 8.52 కోట్లు
తాడిపత్రి	చిట్టూరు-పామిడి	199.20	రూ.16.75 కోట్లు
పుట్టపర్తి	ధర్మవరం-కోడూరు రోడ్డు	52.40	రూ.3.87 కోట్లు
పుట్టపర్తి	ధర్మవరం-కోడూరు రోడ్డు	53.11	రూ.4.02 కోట్లు
శింగనమల	సలకంచెరువు-తాడిపత్రి	74.35	రూ.6.32 కోట్లు

ఉమ్మడి జిల్లాలో చేపట్టే రహదారుల పనులు

నియోజకవర్గం	రోడ్డు	కి.మీ.	నిధులు
రాయదుర్గం	రాయదుర్గం-భూపసముద్రం	8.89	రూ.4.11 కోట్లు
రాయదుర్గం	ఉరవకొండ-కణేకల్లు రోడ్డు	9.81	రూ.4.34 కోట్లు
మడకశిర	మడకశిర-పెనుకొండ రోడ్డు	4.50	రూ.2.13 కోట్లు

క్లుప్తంగా

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కనగానపల్లి: పేద ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్ తెలిపారు. మండలంలోని కేఎస్ పాళ్యం గ్రామంలో బుధవారం సాయంత్రం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులంతా కలసి స్థానిక గ్రామ సచివాలయం వద్ద ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా స్థానిక ప్రజలకు చేకూరిన లబ్ధిదారుల జాబితా బోర్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, సొసైటీ అధ్యక్షుడు భాస్కర్, నాయకులు నాగముని, రమణారెడ్డి, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అలరించిన శతక పద్యగానం



శతక పద్యాలను ఆలపించిన చిన్నారులు

అనంతపురం కల్చరల్: జిల్లా చరిత్రను ప్రతిబింబిస్తూ ప్రపంచ వారసత్వ వారోత్సవాలు సందడిగా సాగుతున్నాయి. జిల్లా టూరిజం శాఖ, పురావస్తుశాఖ, ఇంటాక్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జరిగిన 'శతక పద్యగానం' అందరినీ ఆకట్టుకుంది. నగరంలోని రోటరీ క్లబ్ ప్రాంగణంలో జూనియర్, సీనియర్ విభాగాలుగా జరిగిన శతక పద్యాల కంఠస్థ పోటీలకు పద్యకవి ఒంటెద్దు రామలింగారెడ్డి, పూజారి ఈరన్న, డాక్టర్ నగరూరు రసూల్, కవి, గాయకుడు డాక్టర్ రామాంజనేయులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వివిధ పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థల నుంచి విచ్చేసిన 70 మందికి పైగా చిన్నారులు వేమన, సుమతి, కుమార, కాళహస్తీశ్వర శతకాలలోని పద్యాలను రాగయుక్తంగా పాడి మంత్రముగ్ధులను చేశారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ రాంకుమార్, కవులు రియాజుద్దీన్, షరీఫ్ సమన్వయ కర్తలుగా వ్యవహరించి చిన్నారులను ప్రోత్సహించారు.

రైతులను ఆదుకోవాలి



ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: కరువు ప్రాంత రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం అనుబంధ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎకరాకు రూ.50వేలు చొప్పున గరిష్టంగా రెండు హెక్టార్లకు పరిహారం ఇవ్వాలని కోరారు. వర్షాభావం కారణం విత్తనం వేయని రైతులకు ఎకరాకు రూ.30 వేలు పరిహారం ఇవ్వాలని, కౌలు రైతులకూ పరిహారం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని, దినసరి కూలి రూ.600కు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్‌ఓ గాయత్రీదేవికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నల్లప్ప, బాలరంగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, రామిరెడ్డి, వెంకటనారాయణ, రామాంజి, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

నవ దంపతుల ఆత్మహత్య

- రెండు నెలల క్రితమే పెళ్లి

రామగిరి: నవ దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మండలంలోని గంగంపల్లిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ జనార్దన్ నాయుడు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన దూదేకుల దాదాఖలందర్ (24), బోయ జ్యోత్స్న (20) రెండు నెలల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నారు. ఏం జరిగిందో తెలియదు కానీ, ఇద్దరూ ఇంట్లో బుధవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ జనార్దన్ నాయుడు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

నేడు పాండురంగస్వామి నిజపాద దర్శనం

అనంతపురం కల్చరల్: కార్తీక మాస ఏకాదశిని పురస్కరించుకుని రామనగర్‌లోని శ్రీ రుక్మిణి పాండురంగస్వామి ఆలయంలో నిజపాద స్పర్శ దర్శనం ఏర్పాటు చేశారు. భవసార క్షత్రియ సమాజం ఆధ్వర్యంలో గురువారం ఉదయం ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు

- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మేయర్ వసీం



వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ- వలంటీర్ వ్యవస్థతో పేదల ఇంట సంక్షేమ కాంతులు వెల్లి విరుస్తున్నాయని నగరపాలక సంస్థ మేయర్ వసీం తెలిపారు. బుధవారం నగరంలోని 16, 25 సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. 25వ సచివాలయం పరిధిలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్యతో కలసి సంక్షేమ, అభివృద్ధి బోర్డును మేయర్ ఆవిష్కరించారు. అనంతరం వారు పార్టీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ ముంతాజ్ బేగం, క్లస్టర్ అధ్యక్షుడు రమణారెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్ తదితరులు వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. మేయర్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో అవ్వాతాతలు పింఛన్ కోసం నగరపాలక సంస్థ చుట్టూ ప్రదక్షిణలు చేసేవారన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేస్తున్నారని, వలంటీర్ల ద్వారా ఒకటో తేదీనే ఠంచన్‌గా ఉదయం 5 గంటలకే తలుపు తట్టి పింఛన్ అందజేస్తున్నారని వివరించారు. నగరపాలక సంస్థ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో రూ.800 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తున్న జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని మేయర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, వక్ఫ్ బోర్డు సభ్యులు ఖాజా, వైఎస్సార్‌సీపీ నాయకులు బాకే హబీబుల్లా, సుకేష్, జుబేదా, దాదూ, అబ్దుల్ గఫూర్, అబీదా భాను, ఎంఎల్‌ఓ అమర్‌నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే నగరానికి కొత్త రూపు

అనంతపురం కార్పొరేషన్: జగన్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరిగి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయని డిప్యూటీ మేయర్ వాసంతి అన్నారు. అనంతపురం నగరం కూడా కొత్త రూపు సంతరించుకుందని చెప్పారు. బుధవారం 13వ డివిజన్‌లోని ఉమానగర్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ మేయర్ వాసంతి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, తదితరులు ఇంటింటా తిరిగారు. గత టీడీపీ హయాంలో ప్రజలకు జరిగిన అన్యాయం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును వివరించారు. మేయర్ మాట్లాడుతూ ఇది వరకు వర్షం వచ్చిందంటే ఉమానగర్‌లోని లోతట్టు ప్రాంతంలోకి మరువ వంక మురుగు వచ్చి చేరేదన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవ.. ఆర్డీటీ సౌజన్యంతో రూ.80 లక్షలతో బ్రిడ్జి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా మరువ వంకకు అమృత్ స్కీంలో మరో మైనర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బ్రిడ్జి పనులు పూర్తయితే ముంపు సమస్య పూర్తిగా తీరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఓ అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ అధ్యక్షుడు రమణారెడ్డి, పార్టీ కార్యదర్శి రాధాకృష్ణ, సచివాలయ కన్వీనర్లు కోనేటి సాయిప్రసాద్, చాంద్‌బాషా, వలంటీర్లు రాజు, రాధిక, స్థానికులు నల్లమ్మ, శశికళ, భారతి, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యసాయి జయంతి



సత్యసాయి మహాసమాధి (ఫైల్)

ప్రశాంతి నిలయ: సత్యసాయి 98వ జయంతి వేడుకలు ప్రశాంతి నిలయంలో గురువారం ఘనంగా జరగనున్నాయి. దేశ విదేశాలకు చెందిన సత్యసాయి భక్తులు పెద్ద ఎత్తున పుట్టపర్తి చేరుకున్నారు. వేడుకలకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సిబ్బంది సర్వం సిద్ధం చేశారు. సత్యసాయి మహాసమాధి, సాయికుల్వంత్ సభా మందిరాన్ని ప్రత్యేక పుష్పాలతో తీర్చిదిద్దారు. ఉదయం 8 గంటలకు విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. ప్రశాంతి భజన బృందం సంగీత కచేరీ ఉంటుంది. వేడుకల సందర్భంగా ట్రస్ట్ ఆదాయ వ్యయాలను వివరించే 2022-23 వార్షిక నివేదికను సమర్పిస్తారు. సత్యసాయి దివ్య బోధనలను డిజిటల్ స్క్రీన్లపై ప్రదర్శిస్తారు. సాయంత్రం ప్రశాంతి నిలయం పురవీధులలో స్వర్ణ రథోత్సవం నిర్వహిస్తారు. సాయికుల్వంత్ సభా మందిరంలో పోలోత్సవం నిర్వహిస్తారు. కౌశిక్ చక్రవర్తి బృందం సంగీత విభావరీ నిర్వహిస్తారు. మంగళ హారతితో వేడుకలు ముగుస్తాయి.

భక్తుల సౌకర్యార్థం 70 ప్రత్యేక బస్సులు



ప్రత్యేక కౌంటర్‌ను పరిశీలిస్తున్న డిపో మేనేజర్ ఇనయతుల్లా

పుట్టపర్తి టౌన్: సత్యసాయి బాబా 98వ జయంత్యుత్సవాలకు విచ్చేస్తున్న భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఇనయతుల్లా పేర్కొన్నారు. ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, విజయవాడతో పాటు పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చే భక్తుల సౌకర్యార్థం 70 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. రద్దీని బట్టి సర్వీసులు పెంచుతామన్నారు. పుట్టపర్తి రైల్వేస్టేషన్- పుట్టపర్తి 10, కొత్తచెరువు- పుట్టపర్తి- బుక్కపట్నం 10, ధర్మవరం రైల్వేస్టేషన్- పుట్టపర్తి 10, కదిరి- పుట్టపర్తి-10, హిందూపురం- పుట్టపర్తి 10, పెనుకొండ- పుట్టపర్తి 5, అనంతపురం- పుట్టపర్తి 10, చెన్నై- పుట్టపర్తి 2, హైదరాబాద్- పుట్టపర్తి 2, బెంగుళూరు- పుట్టపర్తి 2 సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. సత్యసాయి భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిమార్గంతోనే ఉత్తమ జీవితం



కాశీవిశ్వేశ్వరాలయంలో పురుషోత్తమ భారతీ స్వామీజీ

అనంతపురం కల్చరల్: భక్తి మార్గంలోనే ఆత్మవిశ్వాసం పెరిగి ఉత్తమ జీవితాన్ని ఆస్వాదించగలరని శ్రీశృంగేరి శివగంగా శారద మఠానికి చెందిన జగద్గురు పురుషోత్తమ భారతీ స్వామీజీ అన్నారు. హైందవ ధర్మ ప్రచార యాత్రలో భాగంగా అనంతపురం వచ్చిన స్వామీజీ బుధవారం పలు ఆలయాల్లో భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఉదయం పాతూరులోని దత్తాత్రేయ మందిరం, పీటీసీలోని కామితార్థ వినాయక దేవస్థానం, మూడో రోడ్డులోని బ్రాహ్మణ వసతి గృహం, మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం తదితర చోట్ల ఆధ్యాత్మిక ప్రయాణంలో మనిషి సాధించే ప్రశాంతత, ఉత్తమ జీవితం గురించి స్వామీజీ ప్రసంగించారు. ఈ సందర్భంగా సాయి ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం జరుగనున్న అంధుల ఆదర్శ వివాహానికి సంబంధించి మంగళసూత్రాలందించారు. మధ్యాహ్నం శారదానగర్‌లోని శంకర మఠంలో చంద్రమౌళీశ్వర పూజలు, శారదా మాత పూజలు నిర్వహించి భక్తులకు స్వయంగా తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఏటీఎం చోరీకి విఫలయత్నం



తాడిపత్రి అర్బన్: ఏటీఎం చోరీకి విఫలయత్నమైన యువకుడు చివరికి పోలీసులకు చిక్కాడు. వివరాలు.. పట్టణంలోని మెయిన్‌బజార్‌లోని యూనియన్ బ్యాంకు చెందిన ఏటీఎం కేంద్రంలోకి మంగళవారం అర్ధరాత్రి ఓ దుండగుడు చొరబడ్డాడు. ఏటీఎం మిషన్‌లో నగదు అపహరించేందుకు విఫలయత్నం చేశాడు. బుధవారం ఉదయం యూనియన్ బ్యాంకు అధికారులు గమనించి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ రంగప్రవేశం చేసి గంటల వ్యవధిలోని సీసీపుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. గుత్తికి చెందిన వినయ్ అనే యువకుడు చోరీ యత్నానికి పాల్పడినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం



శిక్షణకు హాజరైన విద్యార్థులతో అధ్యాపకులు

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులకు చదువుతోపాటు నైపుణ్యాలు ఎంతో అవసరమని ఏపీఎస్‌ఎస్‌డీసీ ట్రైనర్ గౌస్ పేర్కొన్నారు. బుధవారం రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ(అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం బీటెక్ సెకండియర్ విద్యార్థులకు ఏపీఎస్‌ఎస్‌డీసీ బిల్డ్ బాక్స్‌తో గేమ్ డిజైన్‌పై స్కిల్ ఓరియెంటెడ్ కోర్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎస్‌ఎస్‌డీసీ ట్రైనర్ గౌస్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్యాలు ఉంటే మంచి కంపెనీల్లో ఉద్యోగాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. శిక్షణలో బిల్డ్ బాక్స్‌పై, కోడ్ ఉపయోగించకుండా సొంత గేమ్‌ను ఎలా నిర్మించుకోవాలో వివరించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పద్మావతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

అహుడా మాస్టర్‌ప్లాన్ తిరస్కరణ

- కౌన్సిల్ తీర్మానమంటే లెక్కలేదా అంటూ ఏసీపీలపై మేయర్ ఆగ్రహం



టౌన్‌ప్లానింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: కౌన్సిల్ తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకోకుండా రూపొందించిన అహుడా మాస్టర్‌ప్లాన్‌ను నగరపాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య తిరస్కరించారు. కౌన్సిల్ తీర్మానమంటే మీకు లెక్క లేదా అని మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నగరపాలక సంస్థలో ఏసీపీలు మారుతీహరిప్రసాద్, చంద్రమోహన్‌లు మేయర్, డిప్యూటీ మేయర్లను కలిశారు. అహుడా మాస్టర్ ప్లాన్‌లో భాగంగా అనంతపురం పరిధికి సంబంధించిన ప్లాన్‌ను వారికి చూపారు. 2019లో ప్లాన్, నూతనంగా సిద్ధం చేసిన ప్లాన్‌లోని తేడాలను వివరించారు. హౌసింగ్ బోర్డు, తదితర ప్రాంతాలను కమర్షియల్ ప్రాంతాలుగాను, కంపోస్టు యార్డు నుంచి రాజీవ్‌కాలనీ బ్రిడ్జ్ వరకు వెళ్లే వంద అడుగుల రోడ్డును 60 అడుగులకు మార్పు చేసినట్లు తెలిపారు. గత కౌన్సిల్‌లో 16 అభ్యంతరాలను తెలియజేస్తూ పంపిన తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకుని ప్లాన్‌ను సిద్ధం చేశారా అని మేయర్ ప్రశ్నించారు. ఆదర్శనగర్ నుంచి సెవెన్ హిల్స్ కాలనీ (40 అడుగుల రోడ్డు)ను పొందుపర్చారా అని అడిగితే ఏసీపీ మారుతీప్రసాద్ నీళ్లు నమిలాడు. అదేవిధంగా జిల్లా పోలీసు కార్యాలయం నుంచి గుల్జార్‌పేటకు వచ్చే రోడ్డును పోలీసు శాఖ పరిధిలో ఉందని, ఆ రోడ్డు పరిస్థితేంటని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి ప్రశ్నించారు. అందుకు ఏసీపీ మారుతీహరిప్రసాద్ అంతర్గత రోడ్డును ప్లాన్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. వీటితో పాటు మరికొన్ని అభ్యంతరాల పరిస్థితేంటని మేయర్, డిప్యూటీ మేయర్లు అధికారులను ప్రశ్నించారు. అందుకు ఏసీపీ మారుతీహరిప్రసాద్ తాను సలహా కమిటీలో సభ్యుడిగా లేనని, తనకు తెలియదని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. దీంతో మేయర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ తీర్మానం ప్రకారం ప్లాన్‌ను సవరించుకుని తీసుకురావాలని, అంతవరకు తమ వద్దకు రావద్దని తేల్చి స్పష్టం చేయడంతో ఏసీపీలు అక్కడి నుంచి నిరాశతో వెనుదిరిగారు.

ఉత్తమ సాహిత్యంతో సంస్కారం



సభలో మాట్లాడుతున్న ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి

అనంతపురం కల్చరల్: ఉత్తమ సాహిత్యం చదివితే మనిషిలో చైతన్యం పెరిగి సంస్కారవంతుడిగా రూపొందుతారని ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి అన్నారు. వైఎస్సార్ జీవిత సాఫల్య అవార్డు గ్రహీత సీనియర్ రచయిత డాక్టర్ శాంతినారాయణ రాసిన 'సాధన' రాయలసీమ వివక్ష నవలా పరిచయ సభ బుధవారం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో జరిగింది. రాచపాళెం మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన శాంతినారాయణ గొప్ప సాహితీవేత్తగా ఎదిగి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. 'సాధన' నవల సమకాలీన సాంఘిక రాజకీయాలను అద్భుతంగా ఆవిష్కరించిందన్నారు. ముఖ్య అతిథి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, డాక్టర్ ఆశావాది శశాంకమౌళి, డాక్టర్ విజయ్‌కుమార్, నాగేశ్వరాచారి, యోగీశ్వరనాయుడు తదితరులు మాట్లాడుతూ 'సాధన' నవల ప్రతి ఒక్కరినీ చదివించేలా ఉందని, పరిశోధక విద్యార్థుల మధ్య ప్రేమ చిగురించిన విధానాన్ని అద్భుతంగా ఆవిష్కరించారని కొనియాడారు. అంతకుముందు ప్రజా గాయకుడు దాసరి ఆదినారాయణ ఆలపించిన ఉద్దీపన గీతం అందరినీ ఆకట్టుకుంది.

చిన్నారిని హింసించిన వారిని కఠినంగా శిక్షించాలి



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న మేయర్ వసీం తదితరులు

అనంతపురం క్రైం: ఏపీపీ వసంత లక్ష్మీబాయి నివాసంలో పనిచేస్తున్న మైనార్టీ బాలికను దారుణంగా హింసించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నగర్ మేయర్ వసీం ఎస్పీ అన్బురాజన్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. మేయర్ మాట్లాడుతూ శరీరం పుండు అయ్యేలా హింసించారని, ఇప్పటికీ బాలిక భయంతో వణికిపోతోందని తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఎస్పీని కలిసిన వారిలో మేయర్‌తో పాటు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఫయాజ్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైపుల్లా బేగ్, కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, కోఆప్షన్ సభ్యులు షంషుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వాచ్‌మెన్ మృతి

అనంతపురం క్రైం: నగరంలో మోటర్ స్విచ్ ఆన్‌చేయబోయిన వాచ్‌మెన్ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు...శింగనమల మండలం సోదనపల్లికి చెందిన రేణుకమ్మ, ఓబులేసు (33) దంపతులు జీవనోపాధి కోసం అనంతపురం వలస వచ్చారు. ఓబులేసు ఆరో రోడ్డులో గోకుల్ కుమార్ అనే వ్యక్తి వద్ద నెల నుంచి కొత్తగా నిర్మిస్తున్న ఇంటికి వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో నీళ్లు పట్టేందుకు మోటారు ఆన్‌చేయడానికి స్విచ్ వేశాడు. నీళ్లు రాకపోవడంతో పైపును కదిలించే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఇంటి యజమాని ప్రమాదాన్ని గుర్తించి మోటార్ స్విచ్ ఆఫ్ చేశాడు. అపస్మారక స్థితికి చేరుకున్న ఓబులేసును స్థానికుల సహాయంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించి ఓబులేసు మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు నేర్పాలి

కనగానపల్లి: విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై కూడా అవగాహన కల్పించాలని ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చెన్నారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు ప్రతి గురువారం అందించే ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలతో పాటు హిమోగ్లోబిన్ శాతం పెంపుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పాఠశాలలో పరిసరాలు, మూత్రశాలలు శుభ్రంగా ఉంచాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలన్నారు. పిల్లలకు ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే స్థానిక ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ మనోహర్ బాబు, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, హెచ్‌ఎం లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూట్ కోర్టు ప్రారంభం



మూట్ కోర్టులో జడ్జిగా వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో న్యాయశాస్త్ర విభాగంలో మూట్ కోర్టును వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఎల్‌ఎల్‌బీ కోర్సు చేస్తున్న విద్యార్థులకు ప్రాక్టీస్ నిమిత్తం జిల్లా కోర్టుకు రావాల్సిన అవసరం ఉండేది. ఈ నేపథ్యంలో క్యాంపస్‌లోనే న్యాయ శాస్త్ర విభాగంలో మూట్ కోర్టు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ ఆలూరి రామిరెడ్డి, న్యాయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీరాములు, స్కాలర్లు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలపై కోర్టులో పిటీషన్ : డీఎంహెచ్‌ఓ

అనంతపురం మెడికల్: అనధికారికంగా స్కానింగ్ సెంటర్ నిర్వహించడమే కాక లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ పట్టుబడ్డ సునీల్‌కుమార్, శ్రావణిపై పీసీపీఎన్‌డీటీ యాక్ట్ అతిక్రమణ నేరం కింద కోర్టులో పిటీషన్ దాఖలు చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి తెలిపారు. అనంతపురంలోని ఎర్రనేల కొట్టాలలో నిర్వహిస్తున్న అనధికార స్కానింగ్ సెంటర్‌ను ఈ నెల 21న డీఎంహెచ్‌ఓ సీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ... ఎర్రనేలకొట్టాలలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్న సునీల్‌కుమార్, శ్రావణి గత నాలుగు నెలలుగా ఎలాంటి అనుమతులు లేకుండా స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారన్నారు. దాదాపు 124 మందికి స్కాన్ చేసినట్లు ఆధారాలు లభ్యమయ్యాయన్నారు. లింగ నిర్ధారణ చట్టాన్ని అతిక్రమించినందుకు కోర్టులో పిటీషన్ దాఖలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

జెడ్పీలో షూటింగ్ సందడి



క్లాప్ కొడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయంలో షూటింగ్ సందడి నెలకొంది. ఏఆర్‌కే టూరింగ్ టాకీస్ నిర్మాణ సారథ్యంలో తీస్తున్న సినిమాకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ బుధవారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. హీరో విక్టర్, హీరోయిన్ అర్చన, యూనిట్ సభ్యులు ఇల రాజా, చమ్మక్ చంద్ర, జెమిని సురేష్, సమీర్ తదితరులపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు.

కనకదాస విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న కురుబ కులస్తులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి పంచాయతీ ఎస్‌ఆర్ కాలనీలో కురుబ కులస్తులు భక్త కనకదాస విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సంజీవరాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు లింగమయ్య, కురుబ కులస్తులు శ్రీకాంత్, మహాదేవ ,కాటమయ్య, పోతన్న ,అజయ్ గౌడు, శ్రీరాములు, జోగి లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

రజకులకు బోరు ఏర్పాటు

గార్లదిన్నె: కమలాపురం పంచాయతీలో రజకులకు ధోబీ ఘాట్‌కు నీటి సౌకర్యార్థం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఉచితంగా బోరు వేయించారు. ఇటీవల సమస్యను రజకులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే దంపతులు రెవెన్యూ అధికారులతో మాట్లాడి గ్రామంలో ధోబీఘాట్‌కు ఎకరా భూమి కేటాయించడంతోపాటు బుధవారం సొంత డబ్బుతో బోరు వేయించారు. బోరులో నీరు పడటంతో రజకులు సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, నారాయణమూర్తి, రజక సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షులు వెంకటేష్ , రమేష్ పాల్గొన్నారు.